

ఖోఖో రన్నర్‌గా విజయనగరం

ప్రజాశక్తి-ముండ్లమూరు

రాష్ట్రస్థాయి పురుషుల ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా రన్నర్‌గా నిలిచింది. ప్రకాశం జిల్లా విజేతగా నిలిచింది. పురుషులు, మహిళా జట్లలో.. రెండింటిలోనూ ప్రకాశం జిల్లాకు చెందిన జట్లే గెలుపొందాయి. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 11న ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ఈదరలో జిల్లా పరిషత్ హైస్కూలు ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో 13 జిల్లాల నుండి పురుషులు, స్త్రీల జట్లు మరియు ఎంప్లాయిస్ జట్టు మొత్తం 27 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్‌లో మహిళల జట్లలో ప్రకాశం, కృష్ణా జిల్లా తలపడగా ప్రకాశం జిల్లా గెలుపొందింది. పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా, విజయనగరం జిల్లా తలపడగా ప్రకాశం జిల్లా విజయం సాధించింది. మహిళా విభాగంలో రెండో బహుమతి కృష్ణా జిల్లా విజయం సాధించింది. పురుషుల విభాగంలో రెండో బహుమతి విజయనగరం జిల్లా కైవసం చేసుకుంది. పురుషుల జట్లలో మూడో బహుమతి సంయుక్తంగా విశాఖ, అనంతపురం జట్లకు ఇచ్చారు.

అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన

- గుంకలాం జగనన్న కాలనీని సందర్శించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్
- వై జంక్షన్ నుంచి రోడ్‌షో
- రహదారి పొడవునా ఘన స్వాగతం



జనసేన అధినేతకు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పవన్



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, కోట

జనసేన అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందిస్తామని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. వైసిపి ప్రభుత్వం అన్నింటా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. గుంకలాం వద్ద జగనన్న కాలనీలో చేపడుతున్న మౌలిక సదుపాయాలు, జిల్లాలో చేపట్టిన భూమి కొనుగోలులో కూడా భారీఅవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ సహకారం పెద్దగా లేకపోవడం వల్ల పేదలు ఇళ్లు కూడా నిర్మించుకోలేకపోతున్నారని అన్నారు. జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా గుంకలాం వద్దనున్న జగనన్న కాలనీని ఆదివారం ఆయన సందర్శించారు. ముందుగా వైజంక్షన్ నుంచి ఎత్తుబ్రిడ్జి, ఆర్అండ్‌బి, కలెక్టరేట్, కెఎల్‌పురం, గొట్లాం మీదుగా రోడ్‌షో నిర్వహించారు. పవన్‌కు అడుగడుగునా ఆ పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కలెక్టరేట్ కూడలి వద్ద బిజెపి కార్యకర్తలు కూడా జైకొట్టారు. జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు అంటూ పలువురు ప్లకార్డుల ప్రదర్శించారు. మధ్యాహ్నం 1:30 గంటలకు గుంకలాం జగనన్న కాలనీకి చేరుకున్న ఆయన పలు ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కాలనీ నడిమధ్యలో పైలాన్ వద్ద కారు ఓపెన్ టాప్‌పై అక్కడున్న వారినుద్దేశించి మాట్లాడారు. ఈ కాలనీ అభివృద్ధి చేసిన సొమ్ము మంత్రి బొత్స, ఇతర వైసిపి నాయకుల జేబు సొమ్ముకాదన్నారు. ప్రజలు కష్టపడి, చెమటోడ్చిన డబ్బులను కాజేస్తే ఊరుకునేది లేదన్నారు. ఇళ్ల స్థలాల కొనుగోళ్లలోనూ భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని అన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ఇసుక దోపిడీ ఆపలేదని, ఇప్పటికీ అదే పరిస్థితి ఉండడం వల్ల సామాన్యులు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని చెప్పారు. విశాఖ కేంద్రంగా ఉంటూ తాను ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు, కష్టనష్టాలు బాగా తెలుసుకున్నానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న ఎంగిలి మెతుకుల వల్ల ఈ ప్రాంతం ఆకలిబాధలు తీరే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని, తాను అధికారంలోకి వస్తే ఒక్కొక్కరూ పది మందికి ఉపాధి చూపే విధంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. అధికార పార్టీ బెదిరింపులు, అదిరింపులకు జనసేన వెనుకాడేది లేదన్నారు. తన కోసం రోడ్‌షోలో 14 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వచ్చిన యువకులు అవినీతి, అక్రమాలపై నిలదీయలేరా? అని ప్రశ్నించారు. తన కోసం రాజకీయం చేయడం లేదని, పేదల గుండెల్లో ఉన్న ఆవేదన, ఆక్రోశం వెల్లబుచ్చేందుకే గొంతెత్తుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు, ప్రధాన కార్యదర్శులు పాలవలస యశస్విని, టి.శివశంకర్, బొలిశెట్టి సత్య, నాయకులు సుందరపు విజయ్‌కుమార్, పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : జిల్లా పర్యటనకు వచ్చిన జనసేనాని పవన్ కల్యాణ్‌కు మండలంలోని రాజాపులోవ, జొన్నాడ వద్ద ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జొన్నాడ వద్ద పవన్‌కు క్రేన్‌తో గజమాల వేసి, స్వాగతించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల నాయకులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి

ఐసిడిఎస్ నిర్వీర్యానికి కుట్ర

- అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐసిడిఎస్ నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 8వ జిల్లా మహాసభను జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు అధ్యక్షతన ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షులు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో, ఉద్యోగ భద్రత కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పథకాన్ని నీరుగార్చే విధంగా చర్యలు చేపట్టాయని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానం అమలు చేసి, పూర్తిగా అంగన్వాడీ వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తున్నాయని, దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రయివేటీకరణ చేసే ఆలోచనను విరమించుకుని, ఉద్యోగ భద్రత కల్పించే వరకు, ఐసిడిఎస్‌ను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా మహాసభల్లో చర్చించి కర్తవ్యాలను రూపొందించాలన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పైడిరాజు, అనసూయ

అనంతరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీని మహాసభ ఎన్నుకుంది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా వి.లక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పైడిరాజు, ఎస్.అనసూయ, కోశాధికారిగా ఎం.కృష్ణవేణి ఎన్నికయ్యారు. వీరితోపాటు 28 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

పవన్ వ్యాఖ్యలు నిరాధారం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు నిరాధారమైనని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చేతనైత ఎక్కడ? ఎవరు? ఏ రూపంలో అవినీతికి పాల్పడ్డారో నిరూపించాలని సవాలు చేశారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 99,139 మందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 5వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, 2500 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. ఆయా కాలనీల్లో రూ.574 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని వివరించారు. పవన్ వీటిని తెలుసుకోకుండా స్థలాలు కొనుగోలు, మౌలిక సదుపాయాల కల్పనలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం తగదన్నారు. 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలిస్తామని చెప్పిన గత టిడిపి ప్రభుత్వం కనీసం ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. అప్పట్లో ఆ ప్రభుత్వాన్ని పవన్ ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఇసుక ఉచితంగానే ఇస్తున్నామని, పని ప్రారంభించిన వెంటనే రూ.5 వేలు, పది రోజుల్లో రూ.10వేల బిల్లు చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందని, నామినేషన్లు వేసినప్పుడు ఎవరూ వద్దనే పరిస్థితి లేదని అన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాస్వామ్యమంటే పవన్‌కు తెలియదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజాస్వామ్యం అంటే తెలియని, పరిపక్వత లేని నాయకుడు పవన్ కల్యాణ్ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పవన్ పర్యటనను శనివారమే స్వాగతించామని చెప్పారు. కానీ, తన పర్యటనకు కారణం తెలియకుండా అవినీతి జరిగిందంటూ కేకలు వేస్తూ, తన రాజకీయ ఉనికిని చాటుకోవడానికే పర్యటించినట్లు ఉందని అన్నారు. ఏదైనా అవినీతి జరిగితే, కేవలం ప్రకటనలు కాకుండా నిరూపించే దమ్ము పవన్‌కి ఉందా? అని ప్రశ్నించారు. చంద్రబాబుని సంతోషింపజేయడానికి పర్యటిస్తున్నారే తప్ప రాజకీయ పరిజ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు. గుంకలాం పర్యటనలో పవన్ ఒక్క లబ్ధిదారుడితో కూడా మాట్లాడలేదన్నారు. రాని అధికారం కోసం, లేని భ్రమలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయవద్దని హితవుపలికారు. పవన్ మాట్లాడుతున్న మాట, భాష ప్రజలను రెచ్చగొట్టేలా, యువతను పెడదోవ పట్టించేలా ఉన్నాయని తెలిపారు.


సిపిఎస్ రద్దుకు ఉధృత పోరాటం

సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలిరూరల్

సిపిఎస్ రద్దు కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ హాల్లో యుటిఎఫ్ సిపిఎస్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ సిహెచ్.తిరుపతినాయుడు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. బొబ్బిలి ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న సిఎం జగన్ మాట నిలబెట్టుకోవాలన్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామంటున్న జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని, పాత పింఛను విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రాబోయే కాలంలో సిపిఎస్ ను రద్దు చేయడానికి యుటిఎఫ్‌తో కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు.



సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

అనంతరం భవిష్యత్తు పోరాటాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు మినీ సభలు, 21 నుంచి 26 వరకు ఇంటింటి ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కాలంలో మండల, తాలూకా కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 27న విజయనగరంలో 10 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్, గౌరవాధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు ఎం.అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శులు ప్రసాదరావు, త్రినాథరావు, రాజారావు, కేశవ, రాధాభవాని, శ్రీదేవి, అల్లు శంకరరావు, నాయకులు రమేష్, శ్రీనివాస్, శంకరరావు, సుధాకర్, మధు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సోమవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పావని, కార్యదర్శి ఎన్.లలిత తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయ వారోత్సవాల వివరాలను ఆదివారం వెల్లడించారు. 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాయాలలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న జన విజ్ఞాన వేదిక వారితో యువతకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16న వక్తృత్వ, క్విజ్ పోటీలు, 17న చిత్రలేఖన పోటీలు, 18 లలిత సంగీత పోటీలు, 19న దిశ చట్టంపై అవగాహన, 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం, విజేతలలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఆచారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కళాకారులను ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్య, నాటక పోటీలలో వేర్వేరుగా బేబినాయన, శంబంగి పాల్గొని కళాకారులను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులను ఆదుకునేందుకు నాటక పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కళాకారులను, కళలను ప్రోత్సహించాలని కోరారు. కళాకారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.20 కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను సీనియర్ కళాకారుడు గులిపల్లి వెంకటేశ్వర్లు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామ్మూర్తి, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం.. సూపర్‌వైజర్ల నియామకం

పట్టణ ఐసిడిఎస్ పిఒ వైఖరిపై ఆగ్రహం



బొబ్బిలిలోని ఐసిడిఎస్ కార్యాలయం

ప్రజాశక్తి-బొబ్బిలి


అంగన్వాడీ సూపర్‌వైజర్ల పోస్టులను ఇష్టానుసారంగా భర్తీ చేశారు. విద్యలో మెరిట్ ఉన్నవారికి సూపర్ వైజర్లుగా నియమించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టణ ఐసిడిఎస్ కార్యాలయంలో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు వస్తున్నాయి. పట్టణ ఐసిడిఎస్ పిఒ ఇష్టానుసారంగా సూపర్‌వైజర్లకు నియమించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పరీక్షలు నిర్వహించినా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో నియామకాలపై హైకోర్టు స్టే ఇచ్చింది. తాత్కాలిక పద్ధతిలో విద్యలో మెరిట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి సూపర్‌వైజర్లను నియమించాలని, సమానంగా విద్యార్హత ఉంటే సర్వీస్ సీనియారిటీ ప్రాతిపదికన నియామకం చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బొబ్బిలి పట్టణ ప్రాజెక్టులో 3, 4 సెక్టార్లలో సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని విద్యలో మెరిట్ ఉన్నవారిని నియమించాల్సి ఉన్నప్పటికీ పట్టణ పిఒ ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడో సెక్టార్‌లో మూడడ్ల సుశీల, సిహెచ్ విజయలక్ష్మి పిజి పూర్తి చేశారు.

నాలుగో సెక్టార్‌లో కెవి పద్మావతి పిజి పూర్తి చేశారు. సర్వీస్ సీనియారిటీ ప్రకారం మూడో సెక్టార్‌లో కెవి పద్మావతిని, నాలుగో సెక్టార్‌లో సిహెచ్ విజయలక్ష్మిని సూపర్ వైజర్లుగా నియమించారు. ఇద్దరిని నియమించినట్లు ప్రకటించి, అనంతరం భయపెట్టి రాజీనామా చేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడో సెక్టార్‌లో విజయలక్ష్మి రాజీనామా చేయడంతో సుశీలను నియమించాల్సి ఉంది. కానీ ఆమెను నియమించకుండా డిగ్రీ పూర్తి చేసిన వారిని నియమించినట్లు తెలిసింది. సూపర్‌వైజర్ల నియామకం కార్యకర్తలకు తెలియకుండానే చేసినట్లు చర్చ సాగుతోంది. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా సూపర్‌వైజర్లను నియమించిన పట్టణ ఐసిడిఎస్ పిఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సూపర్‌వైజర్ పోస్టుల నియామకాన్ని రద్దు చేసి నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కోసం ఉద్యమం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ భద్రత కోసం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు కోరారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సిఐటియు నాలుగో నగర మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. తొలుత యూనియన్ జెండాను శంకరరావు ఆవిష్కరించారు. సిఐటియు నగర కార్యదర్శి ఎ.జగన్మోహనరావు మహాసభలో నివేదికను ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. కరోనా కష్టకాలంలో కార్మికులను ఆదుకోవాల్సింది పోయి, లక్షలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్కీమ్‌వర్కర్లకు ఉద్యోగ భద్రత, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం కోసం, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్లపై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు నగర అధ్యక్షులుగా బి.రమణ, కార్యదర్శిగా కె.సురేష్, ఉపాధ్యక్షులుగా రెడ్డి శంకరరావు, కోశాధికారిగా ఎ.జగన్మోహనరావు ఎన్నికయ్యారు.



మల్లి మత్సన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా సైనిక్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

కోరుకొండలోని సైనిక్ స్కూల్ 61వ వార్షిక, తల్లిదండ్రుల దినోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కల్నల్ అరుణ్ కులకర్ణి యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి యుద్ధ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా లెఫ్టినెంట్ జనరల్ కె.సురేంద్రనాథ్, గౌరవ అతిథిగా లెఫ్టినెంట్ జనరల్ వైవికె మోహన్ హాజరయ్యారు. పివిఎస్‌ఎం, ఎవిఎస్‌ఎం, ఎస్‌ఎం, విఎస్‌ఎం, క్యాడెట్లకు మెరుగైన శిక్షణ అందించడానికి జీవన పరిస్థితులు, సౌకర్యాల కోసం పాఠశాల చేపడుతున్న వివిధ కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ప్రిన్సిపల్ వివరించారు. ఎన్‌డిఎలో చేరే ప్రయత్నంలో యుపిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు సురేంద్రనాథ్ బహుమతులు అందజేశారు. గత విద్యాసంవత్సరంలో అత్యుత్తమ అకడమిక్ ప్రదర్శకులకు వైవికె మోహన్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల క్యాడెట్లు రంగుల వినోద కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఆర్మీ ట్రూప్స్ భాంగ్రా, ఖుక్రీ, కలరిపట్టు ప్రదర్శనలను నిర్వహించాయి. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యారు

అథ్లెటిక్స్‌లో జైభీమ్‌కు స్వర్ణం

ప్రజాశక్తి-బొబ్బిలి

విశాఖ ఉక్కు స్టేడియంలో ఈనెల 12, 13న జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ స్వర్ణ పతకం సాధించారు. 40 ప్లస్ విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో జైభీమ్ మొదటి స్థానంలో నిలిచారు. 2023 ఫిబ్రవరిలో పశ్చిమ బెంగాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆయన అర్హత సాధించారు. జైభీమ్‌కు పట్టణ ప్రముఖులు, ఎస్ఇబి సిబ్బంది అభినందనలు తెలిపారు. గతంలో కూడా జైభీమ్ అథ్లెటిక్స్‌లో పలు అవార్డులు అందుకున్నారు.



స్వర్ణ పతకంతో ఎస్ఇబి సిఐ జైభీమ్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు

బధిరుల అనాథాశ్రమంలో బాలల దినోత్సవం

డెంకాడ : నగరంలోని బధిరుల అనాథాశ్రమంలో లెండి ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు యూనిట్ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిబాబు, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు, వాలంటీర్ నాయకులు అనూష్, శ్రీజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

వేపాడ : మండల కేంద్రంలో గల స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం జాతీయ 55వ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను గ్రామ సర్పంచ్ మెల్లిపాక అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగ తల్లి, శాఖ గ్రంథాలయ లైబ్రరీ ఎస్.ఎస్ సోమనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలను యువత వినియోగించుకోవాలన్నారు.

వరి కోతల్లో రైతులు బిజీబిజీ

వేపాడ : మండలంలో జగ్గయ్యపేట, వల్లంపూడి, వావిలిపాడు, వేపాడ గ్రామాల్లో ముమ్మరంగా రైతులు వరి కోతలు కోస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడటం వల్ల పంట బాగా పండినప్పటికీ కొన్ని చోట్ల దోమ కాటు వ్యాధులతో దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అభిమానం ఎవరి సొత్తు కాదు

వేపాడ : అభిమానం ఎవరి సొత్తు కాదని మనం పనిచేసే చోట మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు అన్నారు. ఆయన మండల కేంద్రంలో దయా దినోత్సవం సందర్భంగా ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రజల అభిమానం ఉంటే ఉన్నతు, హోదాలు, రాజకీయ అవసరం లేదన్నారు. పనిచేసిన చోట పది మంది మన్ననలు పొందడం గొప్ప విషయమన్నారు.

నేడు క్రీడా పోటీలు ప్రారంభం

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సోమవారం నియోజక వర్గ అండర్ 14,15స్కూల్ గేమ్స్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని మండల విద్యాశాఖాధికారి పి. రామారావు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నెల్లిమర్ల: ఈ నెల 14న మిమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆదివారం మిమ్స్ జనరల్ ఆసుపత్రి వర్గాలు విలేకర్లతో మాట్లాడుతూ అంతర్జాతీయ మధు మేహం దినోత్సవం సందర్భంగా సోమవారం విజయనగరం హెడ్‌పోస్ట్ ఆఫీస్ పక్కన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మిమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియా ట్రిక్స్ సంబంధించిన ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా తనిఖీ, మందులు, ల్యాబ్ పరీక్షలు రాయితీ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కాగా మధు మేహ రోగులే కాకుండా ఇతర వ్యాధి గ్రస్తులు కూడా వైద్య శిబిరంలో తనిఖీలు చేయించుకోవచ్చని చెప్పారు. వైద్యుల సలహ మేరకు ఈసిజి, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లపై ప్రత్యేక రాయితీ ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిమ్స్ జనరల్ ఆసుపత్రి వర్గాలు కోరాయి.

తాగుడు నుంచి బయటపడితేనే గౌరవం

శృంగవరపుకోట : తాగుడు బానిసత్వం నుండి బయటపడిన వారు సమాజంలో గౌరవంగా బతకగలరని ఆల్కహాలిక్ ఎనానిమస్ సభ్యులు అన్నారు. మండలంలోని పోతనపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఆల్కహాలిక్ ఎనానిమస్ గ్రూప్ సభ్యుల 20వ వార్షికోత్సవంలో కొందరు గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ తమను సంప్రదిస్తే తాగుడుకు బానిసైన వారిని మాన్పించే విధంగా కృషి చేస్తామన్నారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

శృంగవరపుకోట : ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని శాఖ గ్రంథాలయ అధికారిణి బి లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎల్ సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్ : రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్ భవనంలో జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎను విడుదల చేయాలన్నారు. జిపిఎఫ్, ఎపిజిఎల్ఐలో ఉన్న రుణాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులను ఆఫ్‌లైన్ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, జోగారావు, ఎస్ఎస్ దొర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి

సాలూరు : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక వెంకట విద్యాగిరి పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమ కాలంలో నెహ్రూ జైలు జీవితాన్ని అనుభవించారని చెప్పారు. ఆయనకు చిన్నపిల్లలంటే అమితమైన ప్రేమ అని చెప్పారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించిన నెహ్రూ పాలనలో అనేక సంస్కరణలు అమలు చేశారని కొనియాడారు.

బొడ్డపాడులో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్డపాడులో శ్రీకాకుళానికి చెందిన జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో 70 మందికి ఆప్తాల్మిక్ అధికారులు భవాని, అప్పలకొండ నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్ర చికిత్స కోసం 30 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.ఇచ్ఛాపురంలో భజన గీతాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కె.ఇచ్ఛాపురంలో శ్రీఉమామహేశ్వర ప్రాంగణంలో ఈనెల 14న కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా అయ్యప్ప పూజ భజన, శివనామ కీర్తనలు చేయబడునని వీరఘట్ట శాస్త్ర సమాజ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

ఆశాజనకంగా వరి పంట

• ఎకరాకు 27 నుంచి 30 బస్తాలు దిగుబడి అంచనా • ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

ఈ ఖరీఫ్ వ్యవసాయానికి సంబంధించి రైతులు అతివృష్టిని ఎదుర్కొంటూ వరి పంటలు పండించారు. ఎన్నో ఒడిదుడుకులతో పండించిన వరి పంటలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 27 నుండి 30 బస్తాల వరకు రావచ్చునని వ్యవసాయ అధికారులు ఎప్పటికే అంచనా వేస్తున్నారు.

రాజాం నియోజకవర్గంలో రేగిడి, వంగర, సంతకవిటి, రాజాం మండలాల్లో సుమారు 59.016 ఎకరాల్లో వరి పంటలు వేశారు. రేగిడి మండలంలో 12,682ఎకరాలు, వంగర మండలంలో 11,816 ఎకరాలు, సంతకవిటి మండలంలో 16వేల 312 ఎకరాలు, రాజాం మండలంలో 18,206 ఎకరాలలో వరి పంటలు సాగు చేశారు. మెట్టు వరి పంటలకు తెగుళ్లు, పల్లపు ప్రాంతాల్లో వరి


వరి కోతలు కోస్తున్న రైతులు

పంటలకు దోమపోటు వంటి తెగుళ్ల రావడంతో వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు మేరకు తెగుళ్ల నివారణపై రైతులు పట్టు సాధించారు. ఈ ఏడాది రైతులు సేంద్రియ ఎరువులతో పాటు, సేంద్రియ రసాయనాలకు మొగ్గు చూపడంతో వరి పంటలు దిగుబడులు సాధిస్తారని ఎఒ గిరడ మురళి కృష్ణ చెబుతున్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో ఆ మెలకువలు రైతులు పాటించి పంట దిగుబడులకు కృషి చేసినట్లు ఆయన వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాజాం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతు కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు నారు జనార్దన్ రావు, పాలవలస రామినాయుడు ప్రభుత్వ అధికారులకు కోరారు. ప్రభుత్వం ధాన్యంకు గిట్టిబాటు ధర కల్పించి, ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. గత ఏడాది ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఏడాది ప్రణాళిక బద్ధంగా ధాన్యం కొనుగోలు చేసి రైతుకు మేలు చేకూరే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.


ప్రసాద్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కౌన్సిలర్‌కు నాయకుల పరామర్శ

నెల్లిమర్ల : నగర పంచాయతి కౌన్సిలర్ మైపాడ ప్రసాద్‌ను తూర్పు కాపు సామాజిక వేదిక నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల గాయపడి మిమ్స్‌లో చికిత్స పొందుతున్న 7వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌ను తూర్పు కాపు సామాజిక వేదిక అధ్యక్షులు రొంగలి రామారావు, వైస్ ప్రెసిడెంట్ అంబళ్ల అప్పల నాయుడు, నాయకులు ప్రొఫెసర్ రామకృష్ణ, నడిపల్లి ఆదినారాయణ, పిన్నింటి చంద్ర మౌళి తదితరులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ వారు తిరిగి కేసు పెట్టడం అన్యాయమన్నారు. పోలీసులు వాస్తవాలు గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ప్రసాద్‌ను పరామర్శించిన వారిలో తూర్పు కాపు సామాజిక వేదిక నాయకులు తరుణ్, తాటి కాయల వెంకట రమణ, దొంతల శ్రీను, కొట్యాడ శ్రీను, ముడి నాగ భూషణం తదితరులు ఉన్నారు.

చంద్రబాబుపై భక్తిని చాటుకున్న పవన్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చంద్రబాబు పై స్వామి భక్తిని చాటుకుంటున్నాడని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. ఆదివారం రామతీర్థంలో ఎమ్మెల్యే విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పవన్ కల్యాణ్ టిడిపితో పొత్తు కొనసాగిస్తూ నీచ రాజకీయాలకు తెరతీస్తున్నాడని మండిపడ్డారు. ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఖరీదైన భూములను ఇళ్లు లేని నిరుపేదలకు అందజేశామని, లక్షలాది కుటుంబాలు లబ్ధిపొందాయని గుర్తు చేశారు. భోగాపురం మండలంలోని సవరవిల్లిలో జగనన్న కాలనీలను పవన్ పరిశీలించాలని సవాల్ విసిరారు.

పవన్ ప్యాకేజీ రాజకీయాలు మానుకోవాలి

పవన్ ప్యాకేజీ రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు హితవు పలికారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయనం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పవన్ ఏడాదికి ఒకసారి ఎవరో ఉసిగొలిపితే తప్ప సమస్యల మీద స్పందించరని ఎద్దేవా పలికారు. తమ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇళ్ల నిర్మించి కాలనీలు ఏర్పాటు చేస్తున్నామని దాన్ని ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.


నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు

శృంగవరపుకోట: రాష్ట్రంలో 31 లక్షల మంది పేద కుటుంబాలకు ఇళ్లలు కడుతుంటే పవన్ ఇప్పుడొచ్చి అభివృద్ధి జరగలేదని దుష్ప్రచారం చేయడానికి సిగ్గు లేదా అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టటణంలోని పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఆర్యవైశ్యుల కార్తీక వన భోజనాలలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ముందుకు పోతుంటే అది చూసి ఓర్వలేక దిగజారుడు రాజకీయం చేయడానికి జిల్లాకి వచ్చారా అని అడిగారు.


పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాజేశ్వరి

ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం

దత్తిరాజేరు : మండలంలోని పెదమానాపురం గ్రామంలో ఆదివారం ఇంటింటికి కుళాయి పనులను జెడ్‌పిటిసి రైతు రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్‌లో భాగంగా పనులను చేపడుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దాస్, ఎంపిటిసి కన్నయ్య, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, వార్డు మెంబరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

నెల్లిమర్ల : మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన గర్భిణీకి సాధన యువజన సంఘం సభ్యులు రక్త దానం చేశారు. శని వారం రాత్రి ఆమె విజయనగరం ముచ్చగోపాల హాస్పిటల్‌లో ప్రసవ నిమిత్తం అత్యవసర పరిస్థితుల్లో బి నెగిటివ్ రక్తం అవసరం కావడంతో హాస్పిటల్ సిబ్బంది, పేషంట్ బందువులు జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘాన్ని సంప్రదించారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన జరజాపుపేట గ్రామానికి చెందిన సాధన సభ్యుడు నామాల శ్రీను విజయనగరం ఎన్.వి.ఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రాత్రి 12 గంటల సమయంలో రక్తదానం చేసి పేషంట్ బందువులకు సకాలంలో అందించారు. అత్యవసర సమయంలో స్పందించే తీరుకు రక్తదాతని సాధన యువజన సంఘం, పేషంట్ బందువులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

పాఠశాలలో అన్నదానం

కొత్తవలస : స్థానిక ఆంజనేయ పేటలో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమం ఉన్న వికలాంగ విద్యార్థులకు విజయనగరానికి చెందిన కింగ్ క్లోవిస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కింగ్ క్లోవిస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వినోద్ పాల్, హనీ డయానా కుమారుడు చి. క్లోవిస్ వాల్టర్ జన్మదినం సందర్భంగా ఈ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం క్లోవిస్ వాల్టర్ పుట్టినరోజున ఈ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించి, వారికి కావలసిన బుక్స్, పలకలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముమ్మందు సహాయ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గ్రామాల్లో మదింపు పరీక్షలు


ప్రజాశక్తి - పూసపాటిరేగ

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిట్టి గురువులు మదింపు పరీక్షకు మండలంలో 980 మందికి గాను 863 మంది హాజరయ్యారని కార్యక్రమ మండల లిటరస్ అధికారి లింగాల ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ మదింపు పరీక్షలో భాగంగా పూసపాటిరేగ ప్రాథమిక పాఠశాల పరీక్షా కేంద్రాన్ని, ఎంఎల్‌ఒ లింగాల ఈశ్వరరావుతో కలిసి మండల కేంద్రాల విద్యాశాఖధికారి టి లలితకుమారి సందర్శించారు. పరీక్షా హాజరు కేటాయింపు, ఇన్విజలేటర్లు ఏర్పాటు, అభ్యాసకుల శాతంను ఎంపిడిఒ జి. రామారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీరు పాల్గొన్నారు.


వేపాడ: పరీక్ష రాస్తున్న మహిళలు

వేపాడ : మండలంలోని పాటూరు, వల్లంపూడి గ్రామాల్లో ఆదివారం చిట్టి గురువులు మదింపు పరీక్షలు అభ్యాసకులతో నిర్వహించారు. ఈ పరీక్షలకు పురుషులు 720 మంది స్త్రీలు 1765 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలను బిఎల్‌ఒ తాతబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణ 18 గ్రామ సచివాలయాలలో గల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో జరిగాయి.

మెరక ముడిదాం: మండలంలో ఆదివారం చిట్టి గురువులు కార్యక్రమం విజయవంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖధికారి పి. రామారావు తెలిపారు. ఈ పరీక్షకు మండలం మొత్తం మీద 4,167మంది నిరక్షరాస్యులు హాజరైనట్లు తెలిపారు. వీరందరని అక్ష రాస్యులుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు.


గుర్ల: మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

గుర్ల: పిల్లలే గురువులుగా మారి నిరక్షరాసులను అక్షరాసులుగా తయారు చేయడం మంచి పరిణామమని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. ఆదివారం మండలంలో జరిగిన చిట్టి గురువుల పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ మండలంలో 1470 మంది పరీక్షల రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ భానుప్రకాష్, ఎంఎల్‌ఒ రామకృష్ణ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల్లో ఉన్న 1070 మందికి చిట్టి గురువులు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మదింపు పరీక్షను నిర్వహించారు. పలుచోట్ల జరిగిన పరీక్షను ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ ఎం. వెంకటరావులు పరిశీలించారు.


చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని చట్టాలు గురించి తెలుసుకుంటే సమస్యల నుండి దూరం కావచ్చునని జిల్లా ప్రధాన న్యాయూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. సాయి కళ్యాణ చక్రవర్తి అన్నారు. ఆదివారం సతివాడలో న్యాయ అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ స్త్రీల పట్ల అందరు గౌరవ భావాలతో మెలగాలని, స్త్రీలు, పిల్లల పట్ల జరిగిన అన్యాయాలకు సంబందించిన కేసుల్లో న్యాయం కోసం పోరాడాలని తెలిపారు. కోర్టులను ఆశ్రయించి ధరఖాస్తు పెడితే విక్టిమ్ కంపెన్సేషన్ స్కీం ద్వారా పూర్తి నష్ట పరిహారం బాధిత మహిళలకు అందించడం జరుగుతుందని సూచించారు. మధ్య వర్తిత్వం ద్వారా చాలా సమస్యలను పరిష్కరించు కోవచ్చునని చెప్పారు. అనంతరం విశాఖపట్నం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ డి. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవా లోపాలున్నా వినియోగదారులందరు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిస్కార వేదిక ద్వారా సమస్యలను పరిష్కరించు కోవచ్చునని టోల్ ఫ్రీ నెంబర్ 1912


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి చక్రవర్తి

వినియోగించు కోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యలు, వాటిని పరిష్కరించుకొనే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.హెచ్.వి.లక్ష్మి, ఎస్‌సి, ఎస్‌టి న్యాయమూర్తి ఎస్.కె. సికిందర్ బాషా, విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి బి. శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్. దేవి రత్న కుమారి, అడిషనల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ బి. రమ్య, కె. మొహిద్దీన్ జామృత బేగం, స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మొబైల్ బి. విజయలక్ష్మి, ఎస్ఐ పి.నారాయణ రావు, సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు. ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు


గీతకార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

బొబ్బిలి : కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత ఆధ్వర్యంలో కార్పొరేషన్ డైరెక్టర్లు నిర్వహించిన కతజ్ఞత సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు మరణిం చిన కార్మికులకు చెల్లించే పరిహారాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలో 95,245 మంది గీత కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కల్లుగీత లైసెన్స్ విధానం అత్యంత పారదర్శకంగా జరిగేలా పాలసీని రూపొందించారని తెలిపారు. ప్రజల్లో ఉన్న ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలు చేస్తున్నా యని విమర్శించారు. వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్‌పర్సన్ గొలగాన రమాదేవి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సంఘం అధ్యక్షులు పిల్లి నూక రాజు, డైరెక్టర్లు చుక్క విష్ణు వందన, కొలుసు రూపావతి, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు పై అవగాహన దినోత్సవం కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయినా ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం 18 సంవత్సరాలు నిండి ఉండి అర్హత కలిగిన విద్యార్థులందరికీ ఓటర్ అప్లికేషన్లను పంపిణీ చేశారు. తర్వాత విద్యార్థులందరూ స్లోగన్స్ చెప్పు, ప్లకార్డులు చేతబట్టి ఓటర్ అవగాహనపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ కుమార్, వాసుదేవరావు, డాక్టర్ సివిఎస్ రవీంద్రనాథ్, వలిఖాన్, సంధ్యారాణి, భాస్కర్, శ్రీనివాసరావు, రెవెన్యు సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

కళాకారుల ఎంపిక

ప్రజాశక్తి- బొబ్బిలి

యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 20న కళాభారతి ఆటోరియంలో జరిగే ఆనందోబ్రహ్మ ప్రదర్శనకు కళాకారుల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా చేపట్టినట్లు అధ్యక్షులు ఎం.విజయ మోహన్ రావు తెలిపారు. స్థానిక శ్రీ చైతన్య విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ ఎస్.గౌరీ శంకర్రావు అధ్యక్షతన ఆదివారం ఈ ప్రక్రియ చేపట్టారు. కళాకారుల ప్రదర్శనను సభ్యులు తిలకించారు. చిత్రకోట బొడ్డవలసకు చెందిన కోలాటం, మెట్టవలస వారి హరి నామ స్మరణం, నారాయణపురం వారి శివతాండవం, అలజంగి వారి జానపద ఘట్టాలను, పలువురు బాల బాలికల నృత్యాలు, ప్రదర్శనలను చూసి, ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఆరో ఆనందో బ్రహ్మ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు టివి రమణ, ఎవి రమణ, ఆర్.గోవిందరావు, బిహెచ్ గంగాధర్, ధూపం వాసు, ఎస్.రాంబాబు, పి.షణ్ముఖేశ్వర్, ఇ.వెంకటరమణ, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.


ఎంపికైన కళాకారులు

పొంచి ఉన్న ప్రమాదం

మక్కువ : మండల కేంద్రం నుంచి చెముడు పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం వల్ల ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ స్తంభం ఎప్పుడు ఏ క్షణాన పడుతుందో తెలియక వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదాన్ని కాస్త ఆపేందుకు స్థానికులు విద్యుత్ స్తంభానికి పొడుగాటి కర్ర దాపు ఉంచారు. ఇలాంటి ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాన్ని తక్షణమే అధికారులు స్పందించిసరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపైకి వాలిన స్తంభం

నేరాలు ఘోరాలు

పిక్నిక్‌లో అపశ్రుతి


నారాయణరావు

భామిని : మండలంలోని నేరడి బ్యారేజ్ పరిధిలో కొంతమంది స్నేహితులు పిక్నిక్ వెళ్లారు. ఈ పిక్నిక్‌లో నేరడికు చెందిన సరిసభద్ర నారాయణరావు (38) బుల్లెట్‌పై తిరిగి వచ్చే క్రమంలో బోల్తాపడింది. దీంతో సంఘటనా స్థలంలోనే ఆయన కుప్పకులాడు. వెంటనే స్నేహితులు భామిని పిహెచ్‌సి తీసుకువచ్చే క్రమంలో మార్గమధ్యలో చనిపోయాడు. నారాయణరావుకు భార్య రజిని, పిల్లలు నవీన్, లక్ష్మి ఉన్నారు. బత్తిలి ఎస్ఐ సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పాచిపెంట మండలంలోని కూనంబందవలసకు చెందిన చీమల శశికుమార్ (25) చేపల వేటకు వెళ్లి మృతి చెంది. ఆదివారం ఆయన విశ్వనాథపుం వద్ద గల వేగావతిలో తన సోదరుడుతో పాటు మరికొంతమంది కలిసి చేపల వేట వెళ్లాడు. వేటాడే క్రమంలో నదిలో మునిగిపోయాడు. వెంటనే సహచరులు ఆయన్ను బయటకు తీసి సాలూరు సిహెచ్‌సికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హెచ్‌సి కృపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శశకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాన్ షాప్ దగ్ధం

మక్కువ : స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న ఒక పాన్ షాప్ ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. షాప్‌పై భాగం నుంచి విద్యుత్ తీగ నుంచి మంటలు రావడంతో వెనుక భాగం నుంచి అంటుంది షాపు యజమాని ఎన్.రాజు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగినట్లు బాధితులు రోధిస్తున్నారు. ప్రమాదంలో తమ జీవనాధారాన్ని కోల్పోయామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నర్సిపురంలో బస్సును ఢీకొన్న లారీ

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం బస్టాప్ వద్ద ఆదివారం ఆగివున్న పల్లె వెలుగు బస్సును క్వారీ లారీ వెనుక నుండి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. బస్సు ఆగి ఉన్నందున ప్రమాదం తప్పిందని బస్ డ్రైవర్, స్థానికులు చెపుతున్నారు. దీంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.